పలు అభివృద్ధి పనులు ప్రారంభం

చొప్పదండి, అక్టోబర్ 8 : చొప్పదండి పట్టణంలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంగళవారం ప్రారంభించారు. పట్టణంలోని పాత హనుమాన్ దేవాలయం దగ్గర బోర్ వేయడానికి భూమి పూజ చేసి, కొత్తగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. అనంతరం బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించి, దుర్గాదేవి మండపాలను దర్శించుకున్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణచౌక్, అక్టోబర్ 8 : జిల్లా కేంద్రంలో పని చేస్తున్న జర్నలిస్టులకు గత ప్రభుత్వం హయాంలో ఇచ్చిన నివేశన స్థలాలపై నెలకొన్న అడ్డంకులను కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించి, వారికి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారికంగా అందించిన పట్టాలు రద్దయినట్లు కలెక్టర్ తెలపడం సరికాదన్నారు. గత ప్రభుత్వాలు రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సారెస్పీ స్థలాలను ఇండ్ల నిర్మాణం కోసం పేదలకు ఇచ్చాయని గుర్తు చేశారు. ఏడాది కిందట జర్నలిస్టులకు పట్టాలు ఇచ్చినప్పటికీ ఇళ్లు నిర్మించుకోకుండా అధికారులు అడ్డుకోవడం తగదన్నారు. ఈ సమస్యపై మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టి సారించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ షాక్‌తో పెయింటర్ మృతి

రాంనగర్, అక్టోబర్ 8: విద్యుత్ షాక్‌తో బిల్డింగ్ పైనుండి కింద పడి ఓ పెయింటర్ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. నగర పరిధిలోని సదాశివపల్లికి చెందిన కొండ్ర సంపత్ పెయింటింగ్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం మంకమ్మతోటలో పెయింటింగ్ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయాడు. వెంటనే అతడిని చికిత్స కోసం దవాఖానకు తరలించగా పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. బిల్డింగ్ ఓనర్ నిర్లక్ష్యం వల్లే పెయింటర్ చనిపోయాడని బిల్డింగ్ మేస్త్రీ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ వాపోయారు. కనీస నియమాలు పాటించకుండా బిల్డింగ్ కన్స్ట్రక్షన్ చేస్తున్నాడని, నిరుపేద అయిన సంపత్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బాధ్యులపై చర్యలు చేపట్టాలి

శంకరపట్నం, అక్టోబర్8: అర్కండ్ల వాగు పక్కన ఉన్న పొలాల వైపు వెళ్లేందుకు వేసిన సిమెంట్ పైపును ఓ వ్యక్తి తొలగించి దారిని పొలాల వైపు వెళ్లకుండా ధ్వంసం చేశాడని పలువురు రైతులు ఆరోపించారు. ఈ దారి గుండా పలువురు ఇసుక అక్రమ రవాణాను చేస్తున్నారని, వారి పని పూర్తి కాగానే దారిలో గల సిమెంట్ పైప్‌ను తొలగించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఇసు క అక్రమ రవాణా చేస్తున్న వారి పై చర్యలు తీసుకోవాలన్నారు.

చేపపిల్లల పంపిణీలో పారదర్శకత

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 8: జిల్లాలోని 189 మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలకు చేపపిల్లల పంపిణీలో అత్యంత కచ్చితమైన పారదర్శకతను ప్రభుత్వం చేపట్టినట్లు జిల్లా మత్స్య శాఖ అధికారి భారతి మంగళవారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. 2024-25 సంవత్సర మత్స్యశాఖ కరీంనగర్ ద్వారా ఉచిత చేపపిల్లల విడుదల చేసేందుకు మత్స్యశాఖ సంచాలకులు హైదరాబాద్ సీడ్ స్టాకింగ్ కమిటీలను వివిధ స్థాయి అధికారులతో ఏర్పాటు చేసినట్లు సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ కమిటీ సభ్యుల విధివిధానాలను తెలియపరుస్తూ ఉతర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. చేప పిల్లలు చెరువులో విడుదల చేసే ముందే పిల్లల నాణ్యత, పిల్లల కచితమైన సైజ్ పరిశీలించి అనుమతించాలన్నారు.

ఇక ఆ వాహనాలు తుక్కుకే..!

ఉమ్మడి జిల్లాలో 1,74,111 పాత వెహికిల్స్

తిమ్మాపూర్, అక్టోబర్ 8 : మానవ మనుగడ వృద్ధి చెందుతున్నాకొద్ది వాహనాల వాడకం విపరీతంగా పెరిగిపోతున్నది. దీంతో వాయు కాలుష్యం ఎక్కువవుతున్నది. దీనికి తోడు గతంలో ఎప్పుడో కొన్న వాహనాలను మరమ్మతులు చేయిస్తూ కొందరు కాలం వెల్లదీస్తుండడంతో విపరీతమైన కాలుష్యం పెరుగుతున్నది. దీనికి తోడు వాహనాలు కండిషన్ లేకపోవడంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఈ క్రమంలో 15 ఏళ్లు దాటిన వాహనాలను తుక్కు కిందకు తీసుకునే కార్యానికి శ్రీకారం చుట్టనున్నట్లు విశ్వసనీయ తెలిసింది. ఈ ప్రతిపాదనలు గతంలోనే ఉండగా మరోసారి తెరపైకి వస్తున్నది. కాగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15 ఏళ్లు దాటిన అంటే 2009 కంటే ముందు కొన్న వాహనాల సంఖ్య 1,74,111 ఉండగా, జిల్లాల వారీగా చూస్తే కరీంనగర్‌లో అత్యధికంగా 1,58,129, జగిత్యాలలో 4,283, పెద్దపల్లిలో 9660, రాజన్న సిరిసిల్లలో 2,039 ఉన్నాయి.

ప్రస్తుతం ఇలా..

కొత్త వాహనం కొనుగోలు చేసిన సమయంలో కేవలం 15 ఏళ్ల వరకే దానికి రిజిస్ట్రేషన్ అనుమతి లభిస్తుంది. ఆ సమయం గడిచాక వాహనదారుడు ప్రభుత్వానికి గ్రీన్ టాక్స్ చెల్లించి మరో ఐదేళ్లు పెంచుకునేందుకు దరఖాస్తు చేసుకుంటారు. వాహన కండిషన్, పొల్యూషన్ చూసి రవాణా శాఖ అధికారులు గడువు పెంచుతారు.

కొత్త ప్రతిపాదనలు ఇలా..

ప్రభుత్వ కొత్త ప్రతిపాదనల ప్రకారం వాహన కండిషన్ ఎలా ఉన్నా 15 ఏళ్లు దాటిందంటే వాహన యాజమానే ప్రభుత్వానికి నిర్ణీత మొత్తంలో గ్రీన్ టాక్స్, సర్వీస్ టాక్స్ చెల్లించాలి. ప్రభుత్వమే వాహనాన్ని స్వాధీనం చేసుకుని, ఆ యాజమాని పేరును తొలగిస్తుంది. అయితే, ప్రభుత్వం ఏ విధంగా స్వాధీనం చేసుకుంటుంది, తుక్కుకింద తీసుకునే వాహనానికి దాని యాజమానికి ఏ విధంగా లాభం జరిగేలా చూస్తుందనేదానికి అధికారులు ఇంకా సందిగ్ధంలోనే ఉన్నారు. అయితే రవాణా శాఖలో జరుగుతున్న చర్చ ప్రకారం.. ఏదైనా పెద్ద వాహన సంస్థలు ఈ వాహనాలను స్వాధీనం చేసుకుని.. వారి సంస్థకు చెందిన వాహనాన్ని తీసుకుంటే.. పాత వాహనానికి ఖరీదుతోపాటు కొత్తగా కొనుగోలు చేసే వాహనానికి రాయితీ ఇవ్వనున్నట్లు ప్రతిపాదనలు ఉన్నట్లు సమాచారం. ఈ ప్రక్రియ వచ్చే ఏడాది ప్రారంభం నుండే అమలు చేయనున్నట్లు తెలుస్తున్నది.

ప్రతిపాదనలు ఉన్నాయి

15 ఏళ్లు దాటిన వాహనాలను తుక్కుగా తీసుకోవాలనే ప్రతిపాదనలు ఎప్పటినుండో ఉన్నాయి. అవి మరికొద్ది నెలల్లో కార్యరూపం దాల్చవచ్చు. ప్రభుత్వం నుంచి ప్రస్తుతానికైతే ఎలాంటి సర్క్యులర్స్ లేవు. ఏ విధంగా చేయాలి, ప్రొసీజర్, తదితర అంశాలపై ఉన్నతాధికారులు ప్రభుత్వంతో చర్చిస్తున్నారు. ఎప్పుడవుతుందో చెప్పలేం కానీ, భవిష్యత్తులో కాలంచెల్లిన వాహనాలపై తప్పనిసరిగా నిర్ణయం ఉంటుంది.

- పురుషోత్తం, డీటీసీ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా

ఒంటరిగా నడిచివెళ్లే మహిళలే టార్గెట్

- జల్సాలకు అలవాటు పడి చైన్ స్నాచింగ్ • నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు • వివరాలు వెల్లడించిన ఏసీపీ వెంకటరమణ

స్వాధీనం చేసుకున్న బైక్‌లు, నిందితులతో పోలీసులు

రాంనగర్ అక్టోబర్ 8 : ఒంటరిగా నడుచుకుంటూ వెళ్లే మహిళలను టార్గెట్ చేసుకుని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నిందితులను కరీంనగర్ రూరల్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఏసీపీ వెంకటరమణ వివరాలు వెల్లడించారు. కరీంనగర్ శివారు ప్రాంతమైన ఎలబోతారం గ్రామానికి చెందిన ఎడవల్లి దీపక్ ఎడవల్లి చందు గత కొంతకాలంగా విచ్చలవిడిగా తిరుగుతూ జల్సాలకు అలవాటు పడి, సులువుగా డబ్బు సంపాదించడానికి చైన్ స్నాచింగ్‌ను వృత్తిగా ఎంచుకున్నారు. కరీంనగర్‌లోని పలు పోలీస్ స్టేషన్‌ల పరిధిలోగల సీతారాంపూర్, మెహర్‌నగర్, నగునూర్, వావిలాలపల్లి, గోపాల్‌పూర్, జ్యోతినగర్, తీగలగుట్టపల్లిలో శివారు ప్రాంతాల్లో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్లే మహిళలను టార్గెట్‌గా చేసుకొని బైక్‌పై వచ్చి చైన్ స్నాచింగ్ చేసేవారు. ఇలా వరుస నేరాలకు పాల్పడుతుండడంతో కేసులు నమోదు చేసిన రూరల్ పోలీసులు ఛేదించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మంగళవారం అమ్మ గడి ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అటుగా బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా వెంబడించి పట్టుకున్నారు. వారిని తమదైన శైలిలో విచారించగా చైన్‌స్నాచింగ్‌లు చేసినట్లు ఒప్పుకున్నారు. వీరిపై కరీంనగర్ టూటౌన్‌లో ఒకటి, త్రీటౌన్‌లో రెండు, రూరల్ స్టేషన్‌లో నాలుగు కేసులు ఉన్నట్లు గుర్తించారు. వీరి నుంచి స్కూటీ, బుల్లెట్ బైక్‌ను రికవరీ చేసినట్లు ఏసీపీ తెలిపారు. బంగారాన్ని నిందితుల నుంచి కొనుగోలు చెసిన మరో నిందితుడు బంగారు షాప్ యజమాని సింహరాజు నరేశ్‌ను కరీంనగర్‌లోని తన దుకాణం వద్ద పట్టుకొని, 105.85 గ్రాములు రికవరీ చేసినట్లు వెల్లడించారు.

కరీంనగర్: కలెక్టరేట్‌ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తేవాలి

కలెక్టరేట్ ఎదుట సీపీం నాయకుల ధర్నా

తెలంగాణచౌక్, అక్టోబర్ 8 : పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుల జీవనం భారంగా మారిందన్నారు. పేదల శ్రేయస్సును విస్మరించిన కేంద్ర ప్రభుత్వం బడా వ్యాపారులకు పరోక్షంగా మద్దతిస్తుందని ఆరోపించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు తగ్గినా దేశంలో పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలను ఎందుకు తగ్గించడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నాయకులు వెంకటరెడ్డి, సత్యం, శ్రీనివాస్, సంపత్, ఎడ్ల రమేశ్ పాల్గొన్నారు.

మౌంట్ పతాల్సు పర్వతంపై విద్యార్థులు

శ్రీ చైతన్య డిఫెన్స్ విద్యార్థుల పర్వతారోహణ

తిమ్మాపూర్/ కొత్తపల్లి, అక్టోబర్ 8: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల శ్రీ చైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీకి చెందిన 40 మంది విద్యార్థులు అకాడమీ పీడీ లెంకల మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని మనాలిలో 14600 ఫీట్ల ఎత్తు కలిగిన మౌంట్ పతాల్సు పర్వతాన్ని 12 గంటల్లో అధిరోహించారు. 'ఎస్ ఫర్ లైఫ్ సే నో టూ డ్రగ్స్' అనే నినాదంతో పర్వతారోహణ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి, జూనియర్ కళాశాల డీన్ జగన్మోహన్ రెడ్డి, ప్రిన్సిపాల్ పల్లె శ్యాంసుందర్ రెడ్డి, విద్యార్థులను అభినందించారు.

ఉపాధి హామీ పనులను పర్యవేక్షిస్తున్న నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీం

ఉపాధిహామీ పనులపై సంతృప్తి

హుజూరాబాద్‌టౌన్(సైదాపూర్), అక్టోబర్ 8 : సైదాపూర్ మండలంలోని రాములపల్లి, సర్వాయిపేట గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ పనులు, రికార్డులను మంగళవారం నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీం సభ్యులు అఖిల్, రాజేశ్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు సరిగా అందుతున్నాయో లేదో లబ్ధిదారులు, పెన్షన్‌దారులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ అమలవుతున్న తీరుపై అధికారులు, కూలీలను ఆరా తీశారు. వారి వెంట జిల్లా అధికారులు అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పోరండ్ల కృష్ణ, వెంకటేశ్వర్‌రెడ్డి, ఏపీవో సత్యనారాయణ, ప్లాంటేషన్ సూపర్‌వైజర్, స్వచ్ఛభారత్ టీమ్ మెంబర్ రమేశ్, ఎంపీడీవో బీ యాదగిరి, ఏపీవో రాణి, ఎంపీవో బసిరుద్దీన్, టెక్నికల్ అసిస్టెంట్లు మధు, ఎన్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య

సామ్‌సంగ్ టాప్

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ సామ్‌సంగ్ మరోసారి సత్తాను చాటింది. ప్రస్తుత పండుగ సీజన్ తొలి విడుతలో కంపెనీ మొబైళ్లకు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సీజన్‌లో అమ్ముడైన ఫోన్లలో 20 శాతం మార్కెట్ వాటాతో సామ్‌సంగ్ తొలిస్థానంలో నిలిచిందని టెక్ ఇన్‌సైట్స్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అలాగే సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 6 వరకు కేవలం 11 రోజుల్లోనే 10 లక్షలకు పైగా ఐఫోన్లు కొనుగోలు చేశారు. అత్యధికంగా అమ్ముడైన ఫోన్లలో గెలాక్సీ ఎం35, గెలాక్సీ ఎస్23, గెలాక్సీ ఏ14, గెలాక్సీ ఎస్23 ఎఫ్ ఈలు ఉన్నాయి. బిగ్ బిలియన్ డేస్ పేరుతో ఫ్లిప్‌కార్ట్ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించగా, అమెజాన్ ఇండియన్ ఫెస్టివల్ పేరుతో ఆఫర్లను తీసుకొచ్చాయి.

టాటా టెక్నాలజీస్‌తో బీఎండబ్ల్యూ జట్టు

ముంబై, అక్టోబర్ 8: టాటా టెక్నాలజీస్, బీఎండబ్ల్యూ గ్రూప్ జట్టు కట్టాయి. మంగళవారం తమ జాయింట్ వెంచర్ (జేవీ)ను అధికారికంగా ప్రకటించాయి. బీఎండబ్ల్యూ టెక్ వర్క్స్ ఇండియా పేరిట ఈ జేవీని తెచ్చారు. సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ వెహికిల్స్ (ఎస్‌డీవీ)సహా ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, ఐటీ వ్యాపారం కోసం డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్స్‌ను ఇది అభివృద్ధి చేయనున్నది. కాగా, 100 మంది ఉద్యోగులతో ఇది మొదలు కానున్నది. పుణె, బెంగళూరు, చెన్నై ఆధారంగా కార్యకలాపాలు సాగుతాయి.

ఎఫ్ఎంసీజీపై పామాయిల్ పిడుగు

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: అంతర్జాతీయ మార్కెట్లో భగ్గుమంటున్న పామాయిల్ ధరలు దేశీయ ఎఫ్ఎంసీజీ రంగ సంస్థల లాభాలపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనున్నది. సెప్టెంబర్ త్రైమాసికంలో ఆయా సంస్థల లాభాలు భారీగా తగ్గే అవకాశాలున్నాయని సర్వే వెల్లడించింది. ఒకవైపు పామాయిలు ధరలు, మరోవైపు ఉత్పత్తి వ్యయం, ప్రకటనలకోసం అధికంగా నిధులు వెచ్చించడంతో మార్జిన్లు, లాభాలపై ప్రతికూల ప్రభావం పడనున్నది. గోద్రెజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్, డాబర్, మారికోలు తమ లాభాలు ఏడాది కనిష్ఠ స్థాయికి పడిపోయే అవకాశాలున్నాయని పేర్కొన్నాయి.

హైదరాబాద్‌లో 'రియల్' డౌన్

19 శాతం తగ్గిన ఇండ్ల అమ్మకాలు దేశీయ ప్రధాన నగరాల్లోనే అత్యధికం

జూలై-సెప్టెంబర్‌లో 11,564 యూనిట్లకే పరిమితం ప్రాప్‌టైగర్ తాజా సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: రాష్ట్ర రియల్ ఎస్టేట్ మార్కెట్ మందగమనంలోకి జారుకున్నది. హైదరాబాద్‌లో వరుసగా పడిపోతున్న ఇండ్ల అమ్మకాలు దీన్నే సూచిస్తున్నాయి మరి. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలోనూ గృహ విక్రయాలు నీరసంగానే సాగాయి. ప్రముఖ రియల్ ఎస్టేట్ బ్రోకరేజీ వేదిక ప్రాప్‌టైగర్.కామ్ మంగళవారం దేశీయ రెసిడెన్షియల్ మార్కెట్‌పై 'రియల్ ఇన్‌సైట్' పేరిట విడుదల చేసిన నివేదిక ప్రకారం.. గత నెల సెప్టెంబర్‌తో ముగిసిన 3 నెలల్లో హౌజింగ్ సేల్స్ ఏకంగా 19 శాతం దిగజారాయి. దేశంలోని 7 ప్రధాన నగరాల్లో ఇదే అత్యధికం కావడం గమనార్హం. నిరుడు జూలై-సెప్టెంబర్‌లో 14,191 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. ఈ ఏడాది ఇదే సమయంలో 11,564 యూనిట్లకే పరిమితమయ్యాయి.



బయ్యర్లలో తగ్గిన ఆసక్తి

గత ఏడాదిదాకా హైదరాబాద్‌లో పరుగులు పెట్టిన స్థిరాస్తి మార్కెట్.. ఇప్పుడు పడకేసింది. ప్రస్తుతం కొనుగోలుదారుల్లో ఇండ్లను కొనాలన్న ఆసక్తే కనిపించట్లేదని వ్యాపారులు చెప్తున్నారు. మార్కెట్‌లో నెలకొన్న ఇబ్బందికర పరిస్థితులు ఒక కారణమైతే.. రుణ లభ్యత కఠినం కావడం మరో కారణమని వారు అంటున్నారు. కాగా, పరిస్థితులు ఇలాగే సాగితే కేవలం నిర్మాణ రంగమేగాక, దాని అనుబంధ రంగాలూ సంక్షోభంలోకి జారుకుంటాయని ఇండస్ట్రీ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

హైడ్రా ఎఫెక్ట్

రాష్ట్ర రియల్ ఎస్టేట్ రంగంలో హైడ్రా ప్రకంపనల్ని సృష్టిస్తున్నది. హైదరాబాద్‌లో తెచ్చిన హైడ్రా.. ఇతర నగరాల్లోని లావాదేవీలపైనా గట్టి ప్రభావాన్నే చూపుతున్నది. ఇక రాజధానిలోనైతే హైడ్రా దెబ్బకు బయ్యర్లు.. ముఖ్యంగా ఎగువ మధ్యతరగతి వర్గాలు ఇండ్లు, ఫ్లాట్లు, ప్లాట్లు కొనాలనే ఆలోచనే వాయిదా వేసుకుంటున్నారు. దీంతో కొత్త నిర్మాణాలన్నీ ఆగిపోయాయి. ఇప్పటికే పూర్తయిన ఇండ్లనూ కొనే వారు లేకపోవడంతో పెట్టిన పెట్టుబడుల్ని రాబట్టుకొనేందుకు తక్కువ ధరలకు ఇస్తామన్నా ఆదరణే కరువైపోయింది. ఫలితంగా రియల్టర్లు ఆందోళన, ఆవేదన చెందుతున్నారు.

దేశవ్యాప్తంగా..

హైదరాబాద్‌సహా మొత్తం దేశంలోని 8 ప్రధాన నగరాల్లో ప్రాప్‌టైగర్.కామ్ తాజా సర్వే జరిగింది. ఇందులో ఢిల్లీ-ఎన్‌సీఆర్ మినహా మిగతా 7 నగరాల్లోనూ హౌజింగ్ సేల్స్ పతనమైనట్టు స్పష్టమైంది. అయితే టాప్-7 నగరాల్లో హైదరాబాద్‌లోనే అత్యధికంగా ఇండ్ల అమ్మకాలు తగ్గినట్టు తేలింది. కాగా, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 29 శాతం విక్రయాలు పెరిగాయి. గతంతో పోల్చితే 7,800 యూనిట్ల నుంచి 10,098 యూనిట్లకు ఎగిశాయి. కోల్‌కతాలో గరిష్ఠంగా 22 శాతం క్షీణించాయి. 3,607 యూనిట్ల నుంచి 2,796 యూనిట్లకు పడిపోయాయి. ఇక బెంగళూరులో 11 శాతం, అహ్మదాబాద్‌లో 9 శాతం, చెన్నైలో 8 శాతం, పుణెలో 3 శాతం, ముంబైలో 1 శాతం చొప్పున సేల్స్ దిగజారాయి.

బీవైడీ సరికొత్త ఈవీ

సింగిల్ చార్జింగ్‌తో 530 కిలోమీటర్లు..



న్యూఢిల్లీ, అక్టోబర్ 8: చైనాకు చెందిన ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ బీవైడీ..దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈమ్యాక్స్ 7 రూ.26.9 లక్షల నుంచి రూ.29.9 లక్షల మధ్యలో లభించనున్నది. వీటిలో ఆరుగురు కూర్చోవడానికి వీలుండే మాడల్ ధర రూ.26.90 లక్షలు, ఏడు సీట్ల మాడల్ ధర రూ.27.50 లక్షలు, సూపరియర్ మాడల్ రూ.29.30 లక్షల నుంచి రూ.29.90 లక్షల మధ్యలో లభించనున్నది. దీంట్లో 55.4 కిలోవాట్ల బ్యాటరీ ప్రీమియం మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 420 కిలోమీటర్లు ప్రయాణించనుండగా, అలాగే 71.8 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 530 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 10.1 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 180 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఆటోమేటిక్ క్లైమెట్ కంట్రోల్, వైర్‌లెస్ చార్జర్, ఎయిర్ ప్యూరిఫైర్, మూడు ఎయిర్‌బ్యాగ్‌లు వంటి ఫీచర్స్ ఉన్నాయి. ఈ సందర్భంగా బీవైడీఇండియా హెడ్ రాజీవ్ చౌహాన్ మాట్లాడుతూ..దేశీయంగా ప్రవేశపెట్టిన నూతన ఈవీ పాలసీలో ప్రయోజనాలు పొందడానికి దరఖాస్తు చేసుకునే అవకాశాలు లేవని స్పష్టం చేశారు.

ఈసారి కూడా వడ్డీరేట్లు యథాతథమే!

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: ఈసారి కూడా రిజర్వుబ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయి. దేశవ్యాప్తంగా కూరగాయల ధరలు భగ్గుమంటుండటంతో ఆహార ద్రవ్యోల్బణ సూచీ గరిష్ఠ స్థాయిలోనే నమోదవుతుండటంతో బుధవారం ప్రకటించనున్న తన పరపతి సమీక్షలో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనావేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి మాత్రం వడ్డీరేట్లను అర శాతం తగ్గించేందుకు ఆస్కారం ఉన్నదని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ ఎండీ, సీఈవో ధీరజ్ రెల్లి తెలిపారు. వరుసగా పది సమీక్షలో వడ్డీరేట్లను ముట్టుకోకపోవడంతో రెపోరేటు 6.50 శాతం వద్ద కొనసాగుతున్నది. దేశ ఆర్థిక వ్యవస్థ ఆందోళనకరంగా ఉండటం, పశ్చిమ దేశాల్లో యుద్ధమేఘాలు కమ్ముకోవడంతో చమురు ధరలు భారీగా పెరిగే అవకాశం ఉన్నదని, ఈ నేపథ్యంలో వచ్చే రెండు సమీక్షల్లో ప్రస్తుత రేట్లను కొనసాగించే అవకాశాలున్నాయన్నారు. తొలి త్రైమాసికంలో వృద్ధి 7.5 శాతం సాధించింది.

హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ శివార్లో ప్రత్యేకంగా తైవాన్ పరిశ్రమ పరిశ్రమల కోసం ప్రత్యేకంగా ఓ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దండుమల్కాపూర్‌కు సమీపంలో ఈ పార్క్‌ను ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. ఇందుకు సంబంధించి తైవాన్ చాంబర్ ఆఫ్ కామర్స్(టీసీసీ) ఉపాధ్యక్షుడు సైమన్ లీ, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి మంగళవారం టీజీఐఐసీ కార్యాలయంలో ద్వైపాక్షిక ఒప్పందంపై సంతకాలు చేశారు. దండుమల్కాపూర్ సమీపంలో ఇప్పటికే ఉన్న 600 ఎకరాల ప్రభుత్వ భూమితోపాటు మరో 400 ఎకరాలు సేకరించి మొత్తం వెయ్యి ఎకరాల్లో ఈ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. తైవాన్ నుంచి రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ ఒప్పందం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం ఇప్పటికే రూపకల్పన జరిగిందని, పెట్టుబడిదారులతో సమావేశాలు, రాష్ట్రాన్ని అంతర్జాతీయంగా ప్రమోట్ చేయడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

హమ్మయ్య..కోలుకున్నాయి

సెన్సెక్స్ 584, నిఫ్టీ 217 పాయింట్ల లాభం • 7.5 లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద

ముంబై, అక్టోబర్ 8: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. వరుసగా ఆరు రోజులుగా భారీగా నష్టపోయిన సూచీలు తిరిగి కోలుకున్నాయి. బ్లూచిప్ సంస్థల షేర్లకు లభించిన మద్దతుకు తోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీలను ముందువైపుకు నడిపించాయి. ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 585 పాయింట్లు అందుకొని 81,635 పాయింట్ల వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 217.40 పాయింట్లు ఎగబాకి తిరిగి 25 వేల మార్క్‌ను అధిగమించింది. చివరకు 25,013.15 పాయింట్ల వద్ద స్థిరపడింది. మార్కెట్లు ఉవ్వెత్తున ఎగిసిపడటంతో మదుపరుల సంపద భారీ స్థాయిలో పెరిగింది. గత ఆరు సెషన్లలో రూ.9 లక్షల కోట్లకు పైగా సంపదను కోల్పోయిన మదుపరులు ఒక మంగళవారం నాడే రూ.7 లక్షల కోట్లకు పైగా పెరగడం విశేషం. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ విలువ రూ.7,51,481.51 కోట్లు పెరిగి రూ.4,59,50,926.21 కోట్లు(5.47 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది. ఆసియా, యూరప్ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలకు తోడు ఆర్బీఐ తన పరపతి సమీక్షలో తీసుకునే నిర్ణయం కోసం మదుపరులు వేచి చూస్తుండటం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులను తరలించుకుపోయినప్పటికీ సూచీలు లాభాల్లో ముగిశాయని దలాల్ స్ట్రీట్ వర్గాలు వ